క్లుప్తంగా

పాఠశాల పరిశీలన



వల్లూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు సులభ పద్ధతిలో అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని ఎంఈవో కె.ఎఫ్. కెనడీ అన్నారు. మండలంలోని వల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు సులభ పద్ధతిలో బోధించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పని తీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 విజయ్ భాస్కర్, హెచ్ఎం సయ్యద్ అబ్దుల్ సుబన్, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు, విద్యార్థులు ఉన్నారు.

సైడు కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ



కాకుమాను: మండల కేంద్రం కాకుమాను బీసీ కాలనీలో శుక్రవారం మండల పరిషత్ నిధులతో సైడు కాలువల నిర్మాణ పనులకు జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ.7 లక్షల వ్యయంతో కాలనీలో సీసీ రోడ్లకు సైడు కాలువలకు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాలలో ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాలకు నిధులు మంజూరు చేసి గ్రామాలలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి, ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో నిలిచిన తాగునీటి సరఫరా

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామానికి సరఫరా అవుతున్న నీరు నిలిచిపోయింది. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నీరు సరఫరా రెండు రోజులకు ఒక సారి జరుగుతుంది. పంచాయతీలో సర్పంచి, ఉప సర్పంచి గ్రూపుల మధ్య వర్గపోరు కొనసాగుతుంది. ఇటీవల గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సర్పంచి చెక్ పవర్‌ను డీఎల్‌పీవో లక్ష్మణరావుకు అప్పగించారు. శుక్రవారం పంప్‌హౌస్‌లో వాచ్‌మెన్ పోతురాజు పుల్లయ్య మోటార్‌కు స్విచ్ వేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి చెయ్యి కూడా కాలింది. స్విచ్ బోర్డు తగలబడినా, వాచ్‌మెన్‌కు చెయ్యి కాలినా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



మంగళగిరి: మొక్క జొన్న, జొన్న, పెసర పంటలకు కీటకాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకుని అధికదిగుబడులు సాధించవచ్చని లాం శాస్త్రవేత్తలు లీలారాణి, రామాంజనేయులు తెలిపారు. నగర పరిధిలోని పెదవడ్లపూడిలో పంటలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుగ్గిరాల మండల టీబీ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. క్షయవ్యాధి లేని సమాజం కోసం ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

'సుందరం మాస్టర్' యూనిట్ సందడి

- ఘనంగా విజ్ఞాన్ మహోత్సవ్
- మీలో ఒకడిగా వస్తున్నా... మీరే నా భరోసా
- సినీ నటుడు హర్ష చెముడు (వైవా హర్ష)



'సుందరం మాస్టర్' ప్రమోషన్స్‌లో భాగంగా మాట్లాడుతున్న హర్ష

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్-2కే24లో భాగంగా రెండో రోజు శుక్రవారం 'సుందరం మాస్టర్' సినిమా యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో హర్ష చెముడు, డైరెక్టర్ కల్యాణ్ సంతోష్, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ పాకాల, ప్రొడ్యూసర్ సుధీర్‌లు హాజరయ్యారు. సినీ హీరో హర్ష చెముడు మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన నేను... సినీ హీరోగా మీ ముందుకు మీలో ఒకడిగా వస్తున్నాని, మీరే నా భరోసా అని అన్నారు. విద్యార్థులు ఏదైనా కొత్తగా ప్రయత్నించాలంటే గ్రాడ్యుయేషన్ సమయమే సరైనదన్నారు. తాను ఇంజినీరింగ్ చదివేటప్పుడు ఏదో ఒకరోజు నేను కూడా ఇలాంటి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రావాలని అనుకున్నాను. 10 సంవత్సరాల తర్వాత నేను మీ ముందుకు అతిథిగా రాగలిగానని వెల్లడించారు. మీ మీద మీకు నమ్మకం ఉండాలని, మీకు ఏది అనిపిస్తే అదే చేయాలన్నారు. తన సినీ జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని తెలిపారు. విద్యార్థులందరూ సుందరం మాస్టర్ సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. డైరెక్టర్ కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ బ్యాక్ బెంచ్ విద్యార్థులకు, తోటి స్నేహితులకు సపోర్ట్‌గా నిలిస్తే వారు ఏదో ఒకరోజు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ఈ సినిమా తన మనసుకు బాగా దగ్గరైన సినిమా అని తెలిపారు. ఈ సినిమాలో కామెడీ, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ నచ్చుతాయన్నారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే వైవిధ్యభరితమైందని అన్నారు. అనంతరం సుందరం మాస్టర్ సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.



విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రెండో రోజు సందడి సందడిగా...

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం సందడి సందడిగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు. అంతేకాకుండా విద్యార్థుల పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- చేబ్రోలు



విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండో రోజు జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిఉండాలి



కార్మిక శాఖ అధికారి సాయిజ్యోతి

పొన్నూరు: వ్యాపారులు తమ వ్యాపార నిర్వహణకు తప్పనిసరిగా లైసెన్సు పొందాలని పొన్నూరు కార్మిక శాఖ అధికారి సాయి జ్యోతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శాఖ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాపార సంస్థల చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. దుకాణాలతో పాటు సంస్థలు ఈనెల 29 లోపు లైసెన్సు నమోదు చేసుకోవాలని సూచించారు. హోటళ్లు, టీ స్టాల్స్, మెకానిక్ షాపులు, మెడికల్ షాపులు, కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ తదితర వ్యాపార దుకాణాల నిర్వాహకులు తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలన్నారు. అలాగే లైసెన్స్ కాలం పూర్తి అయిన వారు రెన్యువల్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాపార సంఘాలు వ్యాపారులతో రిజిస్ట్రేషన్లు చేయించాలని కోరారు.

కళ్ళం కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

గుంటూరు రూరల్: మానవ శరీరంలో కళ్ళు ప్రధానమైనవని ప్రతి ఒక్కరూ కళ్ళను పరిరక్షించుకోవాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నేటి సమాజంలో యువత అత్యధిక సమయం సెల్‌ఫోన్‌కు కేటాయించటం వల్ల కంటి సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అంతా యువతదేనని కంటి చూపు సరళంగా ఉంటే ఏ పనైనా చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో తెనాలి నేత్రాలయ ఐకేర్ వైద్యుడు డాక్టర్ షేక్ సైదా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె బుల్లిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సిలంబం పోటీలకు జగ్వికృష్ణ ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము) పోటీల్లో సత్తా చాటిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని ఎం. జగ్వికృష్ణ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్దన్ తెలిపారు.లక్ష్మీపురంలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ స్టేడియంలో గతనెల 28న నిర్వహించిన 13వ సిలంబం (కర్రసాము) రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్-2024లో సింగిల్ స్టిక్, డబుల్ స్టిక్ విభాగాల్లో జగ్వికృష్ణ ప్రథమ బహుమతులు కైవసం చేసుకుందని తెలిపారు. అంతరించిపోతున్న కళగా కాకుండా ప్రతి ఆడపిల్ల ఆత్మరక్షణకు, మనో ధైర్యం, ఆత్మ విశ్వాసానికి ఇటువంటి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినితో పాటు కోచ్‌లు వి. రామకృష్ణ, బి. కిరణ్‌బాబును పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కో-ఆర్డినేటర్ దుర్గాశ్యామ్, ప్రీ-ప్రైమరీ కో-ఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు అభినందించారు.

దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మేడ్ లక్ష్యం

గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి



మేడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి

తాడేపల్లిరూరల్: దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే 'మేడ్ లక్ష్యం కావాలని గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించి మేడ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మేడ్ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్ అధ్యక్షత నిర్వహించారు. రమణమూర్తి మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ప్రభుత్వ విధులు సక్రమంగా నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. సంఘ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ రానున్న రోజులలో ఇంకా మేడ్‌ను బలోపేతం చేసి ముందుకు సాగుదామన్నారు. దళిత ఉద్యోగుల సమస్యలపై అధికారులను కలసి వారి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారం చేయాల్సిందిగా కోరుదామన్నారు. అనంతరం మేడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడ్ డెప్యూటీ సెక్రటరి కె. రామమోహనరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణంరాజు, విజయ, ప్రిన్సిపాల్ ఎం.శైలజ, ఎం.ఉమేష్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్ గ్రామంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చిన్ననాటురిపికి చెందిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధన విద్యార్థుల ఆధ్వర్యంలో పువ్వులు, కూరగాయ పంటలలో వచ్చే తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ఉద్యాన సాంకేతిక పరిజ్ఞాన నమూనా రూపంలో ప్రదర్శించారు. వాటిని గురించి రైతులకు వివరించారు. గుంటూరు లాం ఫాం శాస్త్రవేత్తలు గిరిధర్, రజని, నాగలక్ష్మి, ఫణికుమార్, అసోసియేట్ డీన్ విజయపద్మ, ప్రొఫెసర్ జ్యోతిర్మయి, మండల ఉద్యాన శాఖాధికారి శిరీష, సర్పంచ్ వి.వీరయ్య పాల్గొన్నారు.

రేపు సినీ నటి పూర్ణిమకు సత్కారం

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విభావరి అనంతరం సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

ఆదాయపన్నుపై అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ విద్యార్థులకు ఆదాయపన్నుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయపన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్ కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలకు చెల్లించాల్సిన పన్నుల విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా టీడీఎస్, దాని యొక్క లక్ష్యాలు, ఆదాయ శాఖ పరిధిలో ఉన్న పలు రకాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు కట్టే ప్రతి రూపాయి దేశ ప్రగతికి ఉపయోగపడుతుందని అన్నారు. పాన్‌కార్డ్, టాన్ కార్డుల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినబడ్జెట్ ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్‌కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.బాలాజీ పాల్గొన్నారు.

రేపు నంబూరులో బజరంగ్ సంక్షేమ సంగమం

- ఉచితంగా నేత్ర, గుండె పరీక్షలు, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవలు
- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడి



గుండె పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో నంబూరులో ఆదివారం బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ సంక్షేమ సంగమం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. శిబిరంలో నేత్రజ్యోతి ద్వారా కంటి పరీక్షలు, మీ గుండె పదిలం ద్వారా గుండె సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. అలాగే దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందిస్తామన్నారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించడం, గుండె ఆపరేషన్లు, స్టెంట్లు వేయించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ఉచితంగా త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూర్చడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలందరూ బజరంగ్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు చేబ్రోలులో కళ్లజోళ్ల పంపిణీ

చేబ్రోలు: గత నెల 25వ తేదీన చేబ్రోలు గ్రామంలోని పాత పోలీసు స్టేషన్ రోడ్డులో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో భాగంగా నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరంలో అవసరమైన 705 మందికి కళ్లజోళ్లను సిద్ధం చేశామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. వీరందరికీ శనివారం సాయంత్రం 3 గంటల నుంచి 6 వరకు చేబ్రోలు గ్రామంలోని పాత పోలీసు స్టేషన్ రోడ్డులో కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

పలువురికి గుండె వైద్య పరీక్షలు

కొరిటిపాడు(గుంటూరు): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో గత నెల 31వ తేదీన నిర్వహించిన 'మీ గుండె పదిలం' ఉచిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమని గుర్తించిన 21మందిలో మొదటి విడతగా 10 మందిని శుక్రవారం ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందించినట్టు అంబటి మురళీకృష్ణ తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి ఆరోగ్య పరిరక్షణ కల్పిస్తూ ఆర్థిక భరోసాను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని గుర్తు చేశారు. ఆరోగ్య పరిరక్షణతోపాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించటం సంతోషకరమన్నారు. పెద్దమల్లు సాయికిషోర్‌కు రూ.4.5 లక్షలు, మన్నవ రమాదేవికి రూ.65,000, ఇమడా బత్తినికి రూ.60 వేలు, తుమ్మల ప్రణతికి రూ.1.7 లక్షలు, మొత్తం రూ.7.45 లక్షల చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, బీమినేని వెంకటలక్ష్మి, నాదెళ్ళ రామచంద్రయ్య, మెట్టు వెంకటప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణేశ్వరరావువీధికి చెందిన షేక్ మస్తాన్ టెలిగ్రామ్ యాప్ చూస్తున్న సమయంలో ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి వెబ్‌సైట్ ఓపెన్ చేశారు.
అందులో వచ్చిన విధంగా కొద్దిపాటి డబ్బులు చెల్లించారు. తిరిగి యాప్ నిర్వాహకులు కొద్దిమొత్తంలో డబ్బులు ఇవ్వడంతో నమ్మిన మస్తాన్ దఫాల వారీగా రూ. 8.46 లక్షలు చెల్లించారు. సదరు వెబ్‌సైట్ నిర్వాహకుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోగా, డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో మోసపోయానని గ్రహించారు. ఈ మేరకు షేక్ మస్తాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దానిలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు పలు వృత్తులపై శిక్షణ ఇచ్చి వారికి అవసరమైన మిషనరీని అందజేస్తోంది. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణానికి చెందిన నీలవేణి గ్రూప్ సభ్యురాలు దండగల కోటమ్మకు పట్టణ ప్రగతి యూనిట్ కింద విస్తరాకుల మిషన్ ప్రభుత్వం అందజేసింది. విస్తరాకుల మిషన్‌ను కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే వారి కుటుంబాలు బాగుంటాయని, ప్రభుత్వం పలు రకాల పథకాలను మహిళలకు అందజేస్తోందని, సున్నా వడ్డీ రుణాలతో పాటు, పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా శిక్షణ ఇస్తోందని, మన ప్రాంతంలో నవంబర్ 20 నుంచి 24 వరకు ప్రగతి యూనిట్లపై మహిళలకు అవగాహన కల్పించారని, డోలాస్‌నగర్‌కు చెందిన దండగల కోటమ్మ విస్తరాకుల మిషన్ శిక్షణ తీసుకోవడంతో ఆమెకు ప్రభుత్వం ఎటువంటి వడ్డీ లేకుండా రెండు లక్షల 62 వేల రూపాయలతో మిషన్, అందుకు అవసరమైన ముడి సరుకు అందించారని, మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పావని, సీఓలు పద్మ, హారణి పాల్గొన్నారు.

దేవాంగులకు రాజకీయ ప్రాధాన్యమివ్వాలి

మంగళగిరి: రానున్న ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో దేవాంగులకు మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు కేటాయించాలని దేవాంగల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీఎన్ భవనం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో దేవాంగల ఓట్లు 10 నుంచి 15వేల వరకు ఉన్నాయన్నారు. 20 లక్షలకుపైగా ఓట్లు ఉన్న దేవాంగులకు అధిక సీట్లు కెటాయించిన పార్టీకి తన మద్దతు ఉంటుందన్నారు. ప్రధానంగా చీరాల నియోజకవర్గంలో 40 వేల ఓట్లు ఉన్న దేవాంగలకు రాజకీయ పార్టీలు సీటు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజమండ్రి రూరల్, పుట్టపర్తి, హిందూపురం స్థానాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్ల నాగరాజు, పుచ్చల రామకృష్ణ, బల్ల వెంకటరమణ, బీరక ప్రసాద్, వేమన దుర్గారావు, కాలేపు సత్యనారాయణ, కుర్మా రాహుల్, మేరాసు అరుణబాబు, అల్లక నమశ్శివాయ, ఆనెం ఆనంద్, యర్ర నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

క్రాప్ బుకింగ్ డేటా పరిశీలన



పంట నమోదు డేటా పరిశీలిస్తున్న ఎంఏవో సుబ్రమణ్యం

గుంటూరు రూరల్: ప్రస్తుతం పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టి పంట నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం క్రాప్ బుకింగ్ డేటా సూపర్ చెక్ డేటా వెరిఫికేషన్‌ను మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వీఏఏలు పంట నమోదు, ఈ కేవైసీలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంటను నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి రైతు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలలో పంటలను నమోదు చేసుకోవాలన్నారు. దీని వల్ల అత్యవసర సమయాల్లో పంటనష్టం, ప్రభుత్వం నుంచి సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఆనందబాబు, గ్రామ ఉప సర్పంచ్ నామా నాగేశ్వరరావు, రైతు వంగా నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.